క్లుప్తంగా

నగర ప్రజలకు శుభాకాంక్షలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నూతన సంవత్సరం సందర్భంగా నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి నగర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆమె ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజల శ్రేయస్సు, నగర పరిశుభ్రతే లక్ష్యంగా పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. నూతన సంవత్సరంలోనూ నగర ప్రజల సేవలో నిమగ్నమవుతామని చెప్పారు. గతేడాది ప్రజల కోసం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని, ఈ ఏడాది కూడా అంతకు మించి అభివృద్ధిని నగర ప్రజలకు అందిస్తామని అన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా నగరపాలక సంస్థ పని చేస్తోందని తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ శుభాకాంక్షలు

కొత్త సంవత్సరంలోకి అడుగు పెడుతున్న నేపథ్యంలో పరిశుభ్రమైన నగరం కోసం రాత్రింబవళ్లు నిర్విరామంగా పని చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ వుండ్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నూతన సంవత్సరంలోనూ ఇదే విధంగా పని చేస్తూ ప్రజలకు మరింత సేవ చేస్తామన్నారు.

వైభవంగా హనుమాన్ చాలీసా పారాయణ యజ్ఞం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రామ భక్త హనుమాన్ చాలీసా పారాయణ యజ్ఞం పాతబస్తీలో అత్యంత వైభవంగా జరిగింది. జ్ఞానోదయ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ పాతబస్తీలోని ఓం బంక్వాట్ హాల్‌లో 36 గంటల నిర్విరామ హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమాన్ని చేపట్టారు. శనివారం ప్రదోష కాలంలో ప్రారంభమైన ఈ చాలీసా పారాయణ యజ్ఞం సోమవారం ఉదయానికి ముగియనుంది. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని చాలీసాను పారాయణం చేస్తూ యజ్ఞ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు శ్రీవల్లి సుబ్బారావు, ప్రియదర్శిని రామ్‌చంద్‌లు మాట్లాడుతూ సమాజం ఆధ్యాత్మికత, సనాతన ధర్మం ఆచరించటం ద్వారా ఆరోగ్యం, ఆనందం, శాంతి కలుగుతాయన్నారు. అయోధ్యలో జరుగుతున్న రామాలయ ప్రతిష్ట విజయవంతంగా జరగాలని రామభక్త హనుమాన్‌ను ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈశ్వర్‌సాయికుమార్ గుర్రం, సాయికృష్ణ పేర్ల తదితరులు పాల్గొన్నారు.

కత్తితో దాడి ఘటనపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కత్తితో దాడికి పాల్పడిన వ్యక్తిపై కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భవానీపురం ప్రాంతానికి చెందిన వాసిగిన్ని నాగేంద్ర కుమ్మరిపాలెం సెంటర్‌లో దుస్తుల దుకాణం నడుపుతుంటాడు. శనివారం సాయంత్రం నాగేంద్ర స్నేహితుడైన అనిల్ అయ్యప్ప భజన పెట్టుకున్నాడు. భజనకు నాగేంద్రతో పాటు మరి కొంత మంది స్నేహితులు హాజరయ్యారు. భజన అనంతరం కాలనీలో నివాసం ఉండే చందును ఇంటి వద్ద దింపేందుకు కారులో బయలుదేరారు. కారు తిరిగి వస్తుండగా బ్లాక్ నెం 86 వద్ద నాగూర్ అనే వ్యక్తి తన ఆటోను కారుకు అడ్డుగా నిలిపాడు. కారును ఎందుకు ఆపావని అడగడంతో గోపిని కొట్టడమే కాకుండా అడిగినందుకు నాగేంద్రపై కత్తితో దాడి చేశాడు. దీంతో నాగేంద్ర చెవిపై గాయం కావడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

కార్మికులకు బియ్యం పంపిణీ

ఆటోనగర్(విజయవాడతూర్పు): నూతన సంవత్సరం సందర్భంగా లిడ్‌క్యాప్ చెప్పుల షోరూంలో పని చేసే కార్మికులకు లిడ్‌క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్ బియ్యం బస్తాలను ఉచితంగా పంపిణీ చేశారు. 10 మంది కార్మికులకు ఒక్కొక్కరికి 25 కేజీల బియ్యం బస్తాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ పేదలకు సహాయం చేయడం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. లిడ్‌క్యాప్ చైర్మన్ సతీమణి షర్మిలా, వైఎస్ ట్రేడర్స్ అధినేత డి.ఆనంద్‌కుమార్, కార్మికులు పాల్గొన్నారు.

నగరంలో న్యూ ఇయర్ హంగామా

- కిటకిటలాడిన స్వీట్స్, బేకరీ దుకాణాలు
- గిఫ్ట్, ఫ్రూట్స్ షాపుల వద్ద వినియోగదారుల రద్దీ
- డైరీలకు భలే గిరాకీ



బీసెంట్ రోడ్డులో వినియోగదారుల రద్దీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం నగరంలోని మార్కెట్‌లు కళకళలాడాయి. కొత్త సంవత్సరం తొలి రోజున శుభాకాంక్షలు తెలపడం ఆనవాయితీ. ఆ క్రమంలో అన్ని వర్గాల ప్రజానీకం కొత్త సంవత్సర ఆగమనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యంగా స్వీట్స్, కేక్‌లు, పండ్లను కొనుగోలు చేయడానికి పోటీ పడ్డారు. బేకరీ, స్వీట్స్, ఫ్రూట్స్ దుకాణాల వద్ద వినియోగదారుల రద్దీ కనిపించింది. అక్కడే ప్రత్యేకంగా కేక్‌ల విక్రయాలు ఏర్పాటు చేయడంతో వందల సంఖ్యలో వినియోగదారులు కొనుగోలు చేశారు. అలాగే కొత్త సంవత్సరం శుభాకాంక్షలు తెలిపే క్రమంలో నగర వాసులు పెద్ద మొత్తంలో స్వీట్స్‌ను కొనుగోలు చేశారు. ప్రధాన సెంటర్లలో దుకాణాలు కళకళలాడుతూ కనిపించాయి. నగరంలో నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నింటాయి.

అర్ధరాత్రి వరకు జోష్

అలాగే కొత్త సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేయడానికి గ్రీటింగ్స్‌ను, అలాగే పెద్దలను కలిసి అందజేయడానికి పండ్లను, చిన్నారులకు ఇవ్వడానికి గిఫ్ట్ ఆర్టికల్స్‌ను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతుండటంతో ఆయా దుకాణాలన్నీ కిటకిటలాడుతూ కనిపించాయి. ప్రధానంగా మార్కెట్‌లో ఆయా వస్తువులను విక్రయించే దుకాణాలన్నీ వినియోగదారుల రద్దీ నెలకొంది. డైరీలు విక్రయించే హోల్‌సేల్ దుకాణాల వద్ద వినియోగదారుల సందడి నెలకొంది. కొన్ని సంస్థలు ఆర్డర్లిచ్చి ప్రత్యేకంగా తయారు చేయించగా, మరికొన్ని సంస్థలు మార్కెట్‌లో సిద్ధంగా ఉన్న డైరీలను కొనుగోలు చేశాయి. వివిధ వర్గాల వారు వారివారి స్థాయిలో డైరీలను కొనుగోలు చేశారు. ఇళ్ల ముందు రంగవల్లులతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ఆదివారం అర్ధరాత్రి కేక్‌లు కట్ చేసి, స్వీట్స్ పంచుకుని ఆనందోత్సాహాలతో గడిపారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



విక్రయానికి బోకేలు సిద్ధం



బేకరీలో కేకులు కొనుగోలు చేస్తున్న ప్రజలు



న్యూ ఇయర్ కేక్



స్వీట్స్ కొనుగోలు చేస్తున్న నగర వాసులు

దుర్గగుడి దేవస్థానానికి కంప్యూటర్ విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి హైదరాబాద్‌కు చెందిన భక్తురాలు రూ.50 వేల విలువ చేసే కంప్యూటర్‌ను ఆదివారం విరాళంగా అందజేశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌కు చెందిన ఎం.అశిత, ఇందుమతిలు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ ఈవో కెఎస్.రామారావును కలిసిన భక్తులు రూ. 50 వేల విలువ చేసే కంప్యూటర్, ఇతర మెటీరియల్స్‌ను అందించారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అందజేశారు.

ప్రత్యేక సిబ్బందితో నగర పరిశుభ్రతకు చర్యలు

మేయర్ రాయన భాగ్యలక్ష్మి



నగరంలో పర్యటిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ వుండ్కర్



నగరంలో చెత్త తరలింపును పర్యవేక్షిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, అధికారులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రత్యేక సిబ్బందితో నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ రత్నావళిని ఆదేశించారు. ఈ క్రమంలో మేయర్ భాగ్యలక్ష్మి ఆదివారం ఉదయం ఆర్టీసీ డిపో ఏరియా, 24వ డివిజన్ పరిధిలోని శాతవాహన కాలేజీ ప్రాంతం, 10వ డివిజన్ ఫన్‌టైమ్ క్లబ్ రోడ్, 3వ డివిజన్ కనకదుర్గానగర్ ప్రాంతాలను పరిశీలించారు. నగర వాసులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు సిబ్బందిని పెంచి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. నగర వ్యాప్తంగా 651 బ్లాక్ స్పాట్స్, లెగసీ వేస్ట్ పాయింట్స్‌ను గుర్తించామని మేయర్ తెలిపారు. కార్పొరేషన్, ప్రత్యేక పారిశుధ్య సిబ్బంది విధుల్లో ఉన్నారన్నారు. మధ్యాహ్నం 12 గంటల కల్లా చెత్త తరలింపు వాహనాలతో దాదాపు 250కు పైగా ట్రిప్పులలో చెత్తను ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు తరలిస్తున్నారన్నారు.

నగర పరిశుభ్రతకు సహకరించాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): నూతన సంవత్సరంలో ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ వుండ్కర్ అధికారులు, సిబ్బందితో కలిసి రాత్రి వేళల్లోనూ నగర పరిశుభ్రతలో నిమగ్నమయ్యారు. శనివారం అర్ధరాత్రి సమయంలో నగర వ్యాప్తంగా పర్యటించారు. రోడ్లపై పేరుకుపోయిన చెత్తను జేసీబీ మెషిన్‌తో శుభ్రపరిచే కార్యక్రమాన్ని చేపట్టారు. రామలింగేశ్వరనగర్, ఏలూరు రోడ్, బీఆర్టీఎస్ రోడ్, సత్యనారాయణపురం, రామలింగేశ్వరపేట, ఎక్సెల్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ ప్రాంతాలను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో పేరుకుపోయిన చెత్తను యుద్ధప్రాతిపదికన తొలగించి శుభ్రపరుస్తున్నారన్నారు. క్లాప్ వెహికల్స్ అందుబాటులో ఉంటాయని చెప్పారు. నగర పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని కోరారు.

వైఎస్సార్ సీపీ క్లస్టర్ కమిటీల నియామకం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గ క్లస్టర్ -1 అధ్యక్షుడిగా షేక్ సలీమ్, ఉపాధ్యక్షులు పొలిమెట్ల శరత్‌బాబు, షేక్ చాన్ బాషా, ప్రధాన కార్యదర్శులు పల్లె బాబు, గడ్డం సాంబశివరావు, అన్వర్, కోశాధికారిగా బంకా చాముండేశ్వరి, కార్యదర్శులుగా పీ దమయంతి, సోమిశెట్టి సుబ్బారావు, మహ్మద్ అలీ, మోషిన్ బాబు, కొక్కిలగడ్డ వెంకన్న, కంచిబాబు పలువురు కార్యవర్గ సభ్యులను నియమించారు. క్లస్టర్ -2 అధ్యక్షుడిగా విశ్వనాథ రవి, ఉపాధ్యక్షులు అయితా కృష్ణకిషోర్, కూరాకుల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శులు బూదాల శ్రీనివాసరావు, బొమ్మ మధు, రాయన ప్రవీణ్‌కుమార్, కోశాధికారి గ్రంధి రమేష్, కార్యదర్శులు డేరుంగుల రమణ, పిళ్లా సూరిబాబు, పిళ్లా ఆనంద్‌కుమార్, మధిరాల కమలాకర్, కటికల విజయకుమార్, రేలంగి శ్రీను, పలువురు కార్యవర్గ సభ్యులు నియమితులయ్యారు. క్లస్టర్ -3 అధ్యక్షులుగా పదిలం రాజశేఖర్, ఉపాధ్యక్షులు సానికొమ్ము వెంకటేశ్వరరావు, ఎద్దు సురేష్, ప్రధాన కార్యదర్శులు ముతా వాసు, సింగంపల్లి నూకరాజు, మంగం ఆత్మరామ్, కోశాధికారి ఎండీ ఇషాక్, కార్యదర్శులు ఏలూరు వెంకన్న, మల్లేల శ్రీనివాసరెడ్డి, పఠాన్ రసూల్‌ఖాన్, అజీజ్, బాలు, రాంబాబు నియమితులయ్యారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



చండీహోమంలో పాల్గొన్న ఉభయదాతలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. ఆది దంపతులకు నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లో పెద్ద సంఖ్యలో ఉభయదాతలు పాల్గొన్నారు. తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన భక్తుల రద్దీ మధ్యాహ్నం రెండు గంటల వరకు కొనసాగింది. తెల్లవారుజామున అమ్మవారి ప్రధాన ఆలయంలో నిర్వహించిన ఖడ్గమాలార్చన, ఉత్సవ మూర్తి వద్ద నిర్వహించిన లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, శాంతి కల్యాణం, చండీహోమంలో ఉభయదాతలు పాల్గొన్నారు. లోక సంరక్షణార్థం సర్వ మానవాళి ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ సూర్యోపాసన సేవ నిర్వహించారు. ఆయా ఆర్జిత సేవల్లో పాల్గొన్న ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఆలయ ఈవో రామారావు క్యూలైన్లను పర్యవేక్షించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆలయ అధికారులను ఆదేశించారు. సాయంత్రం పంచహారతుల సేవ, పల్లకీ సేవలోనూ భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

ఒత్తిళ్లే సమస్యలకు కారణం



ఆటోనగర్(విజయవాడతూర్పు): మనసును నశింపచేయడమే అహంకారాన్ని వదలటమే యోగం.. ఆహాన్ని భగ్నం చేసేది జ్ఞానాగ్ని.. నవ్వుతూ జీవితాన్ని గడపడమే యోగం అని ఎం రఘుగురూజీ అన్నారు. వాసవ్య మహిళా మండలి సమావేశ మందిరంలో సమ భావనా మిత్రమండలి ఆధ్వర్యంలో ఆదివారం కోనేరు నరేంద్రబాబు అధ్యక్షతన ఆరోగ్యానికి వ్యక్తిత్వ వికాసానికి యోగా అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రఘుగురూజీ మాట్లాడుతూ.. మితాహారం అవసరమని.. 35 ఏళ్ల పాటు శరీరాన్ని కాపాడితే తర్వాత శరీరం మనల్ని కాపాడుతుందన్నారు. కార్యక్రమంలో టి.శోభనాద్రి, యార్లగడ్డ రంగారావు, సీహెచ్ వెంకటరెడ్డి, గుమ్మా సాంబశివరావు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత సామాజిక బాధ్యత



చెత్త తొలగిస్తున్న కార్పొరేటర్ రామిరెడ్డి, నాయకులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని 17వ డివిజన్ కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి అన్నారు. ఆదివారం రాణిగారితోట, 17వ డివిజన్‌లో ఆయన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పలు వీధుల్లో రోడ్లు ఊడ్చి శుభ్రం చేశారు. కుప్పలుకుప్పలుగా పేరుకుపోయిన చెత్త కుప్పలను క్లాప్ ఆటోలకు ఎత్తి తరలించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులు సమ్మె చేయడంతో డివిజన్‌లో పలు చోట్ల చెత్త పేరుకుపోయిందన్నారు. దీంతో దుర్వాసన వెలువడుతుండడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆ విషయం తన దృష్టికి రావడంతో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రోడ్లు శుభ్రం చేసి, చెత్తను తొలగించామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కె.దామోదర్, కాశీం, నరసింహారెడ్డి, అయ్యపరెడ్డి, తిరుపతిరెడ్డి, జయలక్ష్మి, వెంకటస్వామి, సాయికృష్ణారెడ్డి, మోహిద్దీన్, రాజేష్ పాల్గొన్నారు.